

ఎర్రగడ్డలో ఇంటీరియర్ షోరూమ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, నిర్వాహకులు

## యువత స్వయం ఉపాధితో అభివృద్ధి చెందాలి

**ఎర్రగడ్డ, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి):** ప్రతి ఒక్కరూ ప్రభుత్వ ఉద్యోగాలపై ఆధారపడకుండా స్వయం ఉపాధి పథకాలను ఎంచుకొని యువత అభివృద్ధి చెందాలని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. సోమవారం ఎర్రగడ్డలో నెక్సస్ ప్రైవేట్ లిమిటెడ్ ఏర్పాటుచేసిన యూనిక్ మోడ్యులర్ ఇంటీరియర్ షోరూమ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం ఉపాధి పథకాల ద్వారా తమతోపాటు మరికొంత మందికి ఉపాధి కల్పించవచ్చని అన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఎండీ మోతీనుద్దీన్, మంజీత్ కుమార్, బీఆర్ఎస్ ఎర్రగడ్డ డివిజన్ అధ్యక్షుడు సంజీవ, ప్రధాన కార్యదర్శి షరీఫ్, నాయకులు గని, నాగరాజు, అహ్మద్, సురేందర తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు యాదయ్య

## కమిటీలో అన్ని వర్గాలకు అవకాశం కల్పిస్తాం

**బోరబండ, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి):** వీకర్ సెక్షన్ సైట్-3 శ్మశాన వాటిక అభివృద్ధి నూతన కమిటీలో అన్ని వర్గాల వారికి అవకాశం కల్పిస్తామని వేముల యాదయ్య అన్నారు. సోమవారం సైట్-3 శ్మశాన వాటికలో జరిగిన సమావేశంలో యాదయ్య మాట్లాడుతు శ్మశాన వాటికలో చెట్లు పెంచి పరిశుభ్రత పాటిస్తు స్నానపు గదుల్లో నీటి సదుపాయం కల్పిస్తున్నమన్నారు. మాజీ డిప్యూటీ మేయర్, కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ శ్మశాన వాటికను రూ.1.5 కోట్లతో అభివృద్ధి చేశారన్నారు. ఈ సారి నూతన కమిటీలో హిందు, క్రిస్టియన్ మతాల వారికి అవకాశం కల్పిస్తామన్నారు. సమావేశంలో సీతారాంరెడ్డి, బాలయ్య, ఆర్.యాదయ్య, వెంకటేష్, మల్లేష్, చెన్నయ్య, సతీష్, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సీపీఎం మహాసభలో మాట్లాడుతున్న నగర నాయకులు అజయ్‌కుమార్

## ప్రజా సమస్యలపై పోరాటాలు చేయాలి

**బోరబండ, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి):** ప్రజా సమస్యలపై సమరశీల పోరాటాలు చేయాలని సీపీఎం నగర నాయకులు అజయ్‌కుమార్ అన్నారు. సోమవారం సైట్-3 ట్రస్ట్ కార్యాలయంలో సీపీఎం బోరబండ డివిజన్ ఐదో మహాసభ కార్యదర్శి టి.సాయిశేషగిరిరావు అధ్యక్షతన జరిగింది. ఇటీవల మృతి చెందిన కేంద్ర కమిటీ కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్ర పటానికి నివాళులర్పించారు. అనంతరం పార్టీ నగర నాయకులు అజయ్‌కుమార్ మాట్లాడుతూ రాజకీయ పార్టీలు ప్రజలను ఎప్పుడు మోసం చేస్తునే ఉంటాయన్నారు. ప్రజల పక్షాన పోరాడే కమ్యూనిస్టు పార్టీ నాయకులు ముందుండాలన్నారు. అనంతరం డివిజన్ శాఖ నూతన కమిటీ కార్యదర్శిగా టి.సాయిశేషగిరిరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రాపర్తి అశోక్, లక్ష్మణ్, గంగులప్ప, ఎండి.యాస్, కృష్ణ, సికిందర్ తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ సభ్యత్వ నమోదులో భాగంగా సోమవారం సనత్‌నగర్ డివిజన్‌లో బీజేపీ రాష్ట్ర నాయకులు లింగంపల్లి నర్సింగ్ రావు, బాల నరసింహ నియోజకవర్గంలో జాయింట్ కన్వీనర్ మహేష్, రమేష్ గౌడ్, నాగార్జున రెడ్డి సభ్యత నమోదు కార్యక్రమం నిర్వహించారు.
- సనత్‌నగర్, ఆంధ్రజ్యోతి

## వ్యక్తి అదృశ్యం



బోవయ్య

**పంజాగుట్ట, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి):** గణపతి నవరాత్రి ఉత్సవాల ఊరేగింపు సందర్భంగా డప్పు కొట్టడానికి వచ్చిన ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన పంజాగుట్ట పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... వికారాబాద్ జిల్లా ముటుకుపల్లి గ్రామానికి చెందిన చంగలి బోవయ్య(50) రైతు. అప్పుడప్పుడు డప్పు కూడా కొడుతాడు. నగరంలో గణపతి నిమజ్జనోత్సవాల సందర్భంగా ఈ నెల 16న నగరానికి వచ్చాడు. నిమజ్జనం ముగిసిన తరువాత కూడా ఇంటికి చేరుకోలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు వివిధ ప్రాంతాల్లో వెతికారు. ఫలితం లేకపోవడంతో సోమవారం పంజాగుట్ట పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వివరాలు తెలిసిన వారు 8712661097 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచించారు.

## భార్య, బిడ్డలను చంపుతానని బెదిరింపులు

- జైలుకి వెళ్లి వచ్చినా తీరు మారలేదని భార్య ఫిర్యాదు

**యూసుఫ్‌గూడ, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి):** మద్యం తాగి భార్యను వేదిస్తూ, మామ గొంతుకోసిన కేసులో జైలుకు వెళ్లి వచ్చినా ఆ వ్యక్తిలో ఎలాంటి మార్పు రాలేదు. భార్యను, పిల్లల్ని చంపుతానని బెదిరిస్తున్నాడని మధురానగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం... పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన మహిళకు 2014లో అదే ప్రాంతానికి చెందిన వ్యక్తితో వివాహం అయింది. వారికి ఇద్దరు పిల్లలు పుట్టిన తరువాత భర్త మృతి చెందాడు. దీంతో పాలకొల్లుకు చెందిన పి.సుబ్రమణ్యంతో రెండో పెళ్లి జరిపించారు. అయితే సుబ్రమణ్యం ప్రతిరోజు మద్యం తాగి వచ్చి భార్యను కొడుతు చంపేస్తానని బెదిరిస్తున్నాడు. యూసుఫ్‌గూడ యాదగిరి నగర్‌లో ఉంటున్న తల్లిదండ్రులు రామారావు, సుబ్బలక్ష్మి దగ్గరకు వచ్చి ఆమె నివాసం ఉంటుంది. ఈ క్రమంలో గత మే 24వ తేదీన సుబ్రమణ్యం వచ్చి మామ రామారావు కొంతు కోశాడు. ఈ కేసులో పోలీసులు సుబ్రమణ్యంను అరెస్టు చేసి జైలుకు పంపించారు. ఇటీవల జైలు నుంచి వచ్చిన సుబ్రమణ్యం తన తల్లి ఫోన్ నుంచి భార్యకు వాట్సప్ కాల్ చేసి నిన్ను వదలను, నీ పిల్లలను కూడా చంపేస్తా అంటూ బెదిరింపులకు పాల్పడుతున్నాడు. దీంతో ఆందోళన చెందిన ఆ మహిళ మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఓజీవా ప్రోడక్ట్ పేరుతో ఆన్‌లైన్ మోసం

**యూసుఫ్‌గూడ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి):** ఓజీవా ప్రోడక్ట్ పేరుతో ఓ మహిళ వద్ద నుంచి ఆన్‌లైన్‌లో నగదు కాజేసిన సంఘటనపై మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన గీతాంజన సర్కార్ అనే యువతి నగరంలో ప్రవేట్ ఉద్యోగం చేస్తూ మధురానగర్‌లోని హాస్టల్ ఉంటుంది. ఈ నెల 14వ తేదీ ఆమెకు ఓజీవా అనే ప్రోడక్ట్ సంస్థ నుంచి ప్రమోషన్ కాల్ వచ్చింది. ప్రోడక్ట్ అమ్మకం ద్వారా నగదు వస్తాయని తెలిపారు. దీనికోసం ముందుగా రూ.5,197 రూపాయలు పంపాలని చెప్పారు. దీంతో ఆ యువతి ఆ నగదు గూగుల్‌పే చేసింది. ఆ తరువాత జీఎస్టీ పేరుతో మరో రూ.11,999 రూపాయలు చెల్లించాలని కోరారు. అవి కూడా పంపించింది. త్వరలోనే రూ.56,002 పంపుతామని చెప్పారు. కానీ డబ్బులు రాలేదు. దీంతో మోసపోయానని గ్రహించిన ఆ యువతి మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# మరుగుదొడ్ల మాటున అక్రమార్జన

- వారిపై చర్యలు తీసుకోవాలి
- పలువురు లూ కేఫే నిర్వాహకుల డిమాండ్




వివరాలు వెల్లడిస్తున్న శామ్యూల్ కార్తీక్, సాయి గణేష్, అనిల్

**పంజాగుట్ట, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి):** మరుగుదొడ్ల మాటున అక్రమార్జనకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని, గత ప్రభుత్వ హయాంలో చేసిన లూ కేఫే ఒప్పందాన్ని రద్దు చేయాలని పలువురు లూ కేఫే నిర్వాహకులు డిమాండ్ చేశారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో శేరిలింగంపల్లికి చెందిన శామ్యూల్ కార్తీక్, సాయి గణేష్, లూ కేఫే నిర్వాహకులు అనిల్, భరత్ వివరాలు వెల్లడించారు.

జీహెచ్ఎంసీ పరిధిలో ప్రధాన రహదారులలో ప్రజా మరుగుదొడ్లను అందుబాటులోకి తీసుకురావాలని టెండర్లు పిలవగా బిహార్‌కు చెందిన ఎక్సోరా కార్పొరేట్ సర్వీసెస్ ప్రైవేటు లిమిటెడ్ అధినేత అభిషేక్‌నాథ్ అప్పటి ప్రభుత్వ పెద్దలు, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్, సీఎస్ సోమేశ్ కుమార్, మున్సిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్ సహకారంతో కాంట్రాక్టు దక్కించుకున్నాడని అన్నారు. శేరిలింగంపల్లి, ఖైరతాబాద్ జోన్ల పరిధిలో డివిజన్‌కు 13 చొప్పున సుమారు వందకు పైగా లూ కేఫేలను జీహెచ్ఎంసీ ఏర్పాటు చేసిందని, వాటి నిర్వహణ చూస్తామని చెప్పి ఒక్కో లూ కేఫేను రూ. 20 వేల నుంచి లక్ష రూపాయల వరకు అడ్వాన్స్‌లు తీసుకుని నెలకు ఎనిమిది నుంచి పది వేలకు పైగా చెల్లించే విధంగా వేరే వారికి కట్టబెట్టారని అన్నారు. ఒక్కో కేఫేకు జీహెచ్ఎంసీకి సంవత్సరానికి కేవలం రూ. 1,385 మాత్రమే కడుతూ తమ వద్ద నుంచి నెలకు వేల రూపాయలు వసూలు చేస్తున్నాడని, అతడు నెలకు కోటి రూపాయల వరకు సంపాదిస్తున్నాడని అన్నారు. ప్రభుత్వం స్పందించి అతడి సంస్థతో చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేసి తమకే వాటి నిర్వహణ అప్పగించాలని వారు డిమాండ్ చేశారు.

లూ కేఫేల చుట్టూ యాడ్స్ ప్రదర్శిస్తూ వేల రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారని అన్నారు. ఒక్కో కేఫేకు సుమారు రూ. 3.40 లక్షలు జీహెచ్ఎంసీ వెచ్చించిదన్నారు. లూ కేఫేల నిర్వహణ, తదితర వాటిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఆర్టీఐ ద్వారా పూర్తి సమాచారాన్ని సేకరించామని, తమ వద్ద ఆధారాలున్నాయన్నారు. సమావేశంలో పలువురు నిర్వాహకులు పాల్గొన్నారు.

# సోషల్ మీడియాపై అవగాహన సదస్సు



సోషల్ మీడియా వల్ల జరిగే అనర్థాలపై జరిగిన సదస్సులో పాల్గొన్న పోలీస్ అధికారులు, స్కూల్ నిర్వాహకులు తదితరులు

**ఎర్రగడ్డ, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి):** సోషల్ మీడియాను ఎక్కువగా వాడటంతో ఒత్తిడి, అశాంతి, ఒంటరితనం, డిప్రెషన్ వంటి అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని దిల్‌సే వలంటీర్ అసోసియేట్ డైరెక్టర్ కట్ట దుర్గ అన్నారు. సోమవారం సంస్కార ది లైఫ్ స్కూల్లో సైబర్ క్రైమ్ అవేర్నెస్, సోషల్ మీడియా ద్వారా ఎదురయ్యే అనర్థాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తగ్గిన ఇంటర్నెట్ చార్జీల పుణ్యమా అని ప్రతి ఒక్కరూ సోషల్ మీడియాను ఎక్కువ వాడేస్తున్నారని, దీనివల్ల తక్కువ లాభాలు, ఎక్కువ నష్టాలు ఉన్నాయని అన్నారు. దిల్‌సే వలంటీర్ సీనియర్ ప్రొడక్ట్ మేనేజర్ రూప శంముగం మాట్లాడుతూ సోషల్ మీడియా అనేది ఉపయోగించుకునే దాన్నిబట్టి ఉంటుందని దాంట్లోని మంచిని ఉపయోగించుకుని అభివృద్ధి చెందాలని చెడును వదిలేయాలని సూచించారు.

సోషల్ మీడియాను అధికంగా వాడితే అనర్థాలు తప్పవని, దీన్ని అధికంగా వాడడం వల్ల అబ్బాయిల కన్నా అమ్మాయిలపైనే ఎక్కువ చెడు ప్రభావం ఉంటుందన్నారు. సనత్‌నగర్ పీఎస్ ఎస్ఐ హరీష్ మాట్లాడుతూ సైబర్ క్రైమ్ అనేది కంప్యూటర్ ఉపయోగించి చేసే ఒక నేరపూరిత చర్య అన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత సమాచారాన్ని ఇవ్వడం, ఓటీపీలు షేర్ చేయడం లాంటివి చేయకుండా సైబర్ క్రైమ్‌పై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈరోజుల్లో సైబర్ నేరగాళ్లు తెలివిగా ఫోన్ చేసి ఏదో విషయంలో బెదిరింపులకు పాల్పడి డబ్బులను డిమాండ్ చేస్తున్నారన్నారు. అలాంటి వాటికి భయపడకుండా వెంటనే పోలీసులను ఆశ్రయించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో స్కూల్ ఫౌండర్ సీఈవో మోహన వంశీ, డైరెక్టర్ మధుమతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- స్కూల్ అసిస్టెంట్ పోస్టులను బీఈడీ చేసిన వారితోనే భర్తీ చేయాలని డిమాండ్



అభివాదం చేస్తున్న తెలంగాణ రాష్ట్ర బీఈడీ నిరుద్యోగులు

**పంజాగుట్ట, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి):** తెలంగాణ రాష్ట్రంలో బీఈడీ చేసిన నిరుద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర బీఈడీ నిరుద్యోగులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో నిరుద్యోగ జేఏసీ అధ్యక్షుడు నీల వెంకటేష్, నిరుద్యోగులు భూక్య కుమార్, పాండు, అశోక్ చౌహన్, కిరణ్ కుమార్, యాకన్న, తదితరులు మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ పోస్టులను డైరెక్ట్ రిక్రూట్మెంట్ ద్వారా బీఈడీ చేసిన వారితోనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఉన్న డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌ను బోర్డ్ ఆఫ్ ప్రైమరీ ఎడ్యుకేషన్, బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్‌గా విభజించాలని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో డీఈడీ చేసిన వారికే ఎస్జీటీ పోస్టులు అన్నప్పుడు, బీఈడీ చేసిన వారితోనే ఎస్ఏ పోస్టులు నేరుగా భర్తీ చేయాలని అన్నారు. ప్రస్తుతం ఎస్జీటీలకు పదోన్నతులు ఇచ్చి 70 శాతం స్కూల్ అసిస్టెంట్ పోస్టులను నింపుతూ, బీఈడీ వారితో మిగిలిన పోస్టులు భర్తీ చేస్తుండడంతో తమకు తీవ్ర అన్యాయం జరుగుతోందని అన్నారు. క్యాలెండర్ ప్రకారం విద్యాశాఖలో ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పలువురు బీఈడీ చేసిన నిరుద్యోగులు పాల్గొన్నారు.

# తెలుగు వర్సిటీకి పొట్టి శ్రీరాములు పేరు మార్చొద్దు

- జిల్లా కలెక్టర్‌కు ఆర్యవైశ్య మహాసభ వినతి



హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఆర్యవైశ్య మహాసభ ప్రతినిధులు

**ఖైరతాబాద్, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి):** తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరు తొలగింపుపై మంత్రివర్గం తీసుకున్న నిర్ణయంపై పునరాలోచించాలని కోరుతూ హైదరాబాద్ జిల్లా ఆర్య వైశ్య మహాసభ విన్నవించింది. సోమవారం హైదరాబాద్ కలెక్టరేట్ కార్యాలయం వద్ద నిరసన నిర్వహించి వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా మహాసభ అధ్యక్షుడు సరాబు లక్ష్మణ్ గుప్తా మాట్లాడుతూ భాషా ప్రయుక్త రాష్ట్రాల కోసం ముఖ్యంగా తెలుగు మాట్లాడే వారికోసం ప్రత్యేక రాష్ట్రం కావాలని ఆత్మ బలిదానం చేసిన మహనీయుడిని తెలంగాణ ప్రభుత్వం విస్మరించడం సరికాదన్నారు. అసెంబ్లీలో ఒక పార్టీ ఎమ్మెల్యే తెలుగు విశ్వ విద్యాలయానికి సురవరం ప్రతాపరెడ్డి పేరును పెట్టాలన్న కోరిక మేరకు మంత్రివర్గ సమావేశంలో తీర్మానం చేయడంపై తెలుగు రాష్ట్రాల్లోని ఆర్యవైశ్యులతో పాటు ఇతర రాష్ట్రాల్లో ఉన్న ఆర్యవైశ్యులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని, ప్రభుత్వం వెంటనే ఈ విషయమై పునరాలోచించి విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరును తొలగించకుండా నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. కలెక్టర్‌ను కలసిన వారిలో మహాసభ కోశాధికారి లింగ ప్రకాష్ గుప్తా, అదనపు ప్రధాన కార్యదర్శి సత్యం గుప్తా, ప్రతినిధులు కూర జయ రాములు గుప్తా, కాసనగొట్టు రాజశేఖర్ గుప్తా, కొండ్లె మల్లిఖార్జున్, కాశెట్టి పాండు, తగీరు వెంకటేష్ గుప్తా తదితరులు ఉన్నారు.

## పారిశ్రామిక రంగంలో టెక్నాలజీ పెరగాలి

- సీఐఐ ఎనర్జీ ఎఫిషియెన్సీ కౌన్సిల్ చైర్మన్ రవిచంద్రన్

**హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి):** పారిశ్రామిక రంగంలో ఎనర్జీ-ఎఫిషియెన్సీ టెక్నాలజీ మరింత పెరగాలని, ఉత్పాదకత పెంచడంతో పాటూ పర్యావరణంపై ప్రభావం లేని వస్తువుల తయారీకి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, శక్తి సమర్థవంతమైన పద్ధతులు అవలంభించాలని సీఐఐ ఎనర్జీ ఎఫిషియెన్సీ కౌన్సిల్ చైర్మన్, డాన్ ఫోస్ లిమిటెడ్ అధ్యక్షుడు రవిచంద్రన్ అన్నారు. పారిశ్రామిక రంగంలో ఇంధన సమర్థత సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడమే లక్ష్యంగా బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ (బీఈఈ) సహకారంతో ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్) సోమవారం మాదాపూర్‌లో వర్క్‌షాప్ నిర్వహించింది. కార్యక్రమంలో పాల్గొన్న రవిచంద్రన్ మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న మార్కెట్లో పోటీతత్వాన్ని కొనసాగిస్తూనే దీర్ఘకాలిక సుస్థిరతను పెంపొందించే భాగస్వామ్యాలను ఏర్పరుచుకోవాలన్నారు. మెరుగైన ఇంధన సామర్థ్యం, వాతావరణ మార్పుల ఉపశమనం దిశగా పరిశ్రమలకు మార్గనిర్దేశం చేయడంలో బీఈఈ కీలక పాత్ర పోషిస్తుందని బీఈఈ డైరెక్టర్ శ్యాం సుందర్ తెలిపారు. బీఈఈ, ఈఈఎస్ ఎల్ సంయుక్తంగా రూపొందించిన డెమాన్ స్ట్రేషన్ ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ ప్రాజెక్ట్ (డీఏపీ) ప్రోగ్రామ్ బ్రోచర్ ఆవిష్కరించారు. నెట్ జీరో ఉద్గారాల దిశగా దేశంలో పురోగతిని మరింత ముందుకు తీసుకువెళ్లడానికి ప్రభుత్వ అధికారులు, పరిశ్రమ సంఘాలు, టెక్నాలజీ ప్రొవైడర్లు, నిపుణులతో సహా 100 మందికి పైగా పరిశ్రమ వాటాదారులను ఈ వర్క్‌షాప్ ద్వారా ఒక్కచోటకు చేర్చినట్లు నిర్వాహకులు తెలిపారు.



ఎన్‌బీటీనగర్ అధ్యక్షుడిగా ఎన్నికైన శేఖర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

## ఎన్‌బీటీనగర్ బస్తీ అధ్యక్షుడిగా శేఖర్ ముదిరాజ్

**బేగంపేట, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి):** బేగంపేట డివిజన్‌లోని పాటిగడ్డ ఎన్‌బీటీనగర్ అధ్యక్షుడిగా శేఖర్ ముదిరాజ్ ఎన్నికైయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు బస్తీ వాసులతో ఎమ్మెల్యే తలసానిని కలిసి బస్తీ అభివృద్ధికి కృషి చేయాలని విన్నవించారు. శేఖర్‌ను ఎమ్మెల్యే తలసాని సన్మానించి మాట్లాడుతూ బస్తీ అభివృద్ధికి తన వంతు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తానన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి

**సనత్‌నగర్, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి):** భరత్‌నగర్ మార్కెట్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి(50) అనారోగ్యానికి గురయ్యాడు. భరత్‌నగర్ బ్రిడ్జిపై కదలలేని పరిస్థితిలో ఉండగా పోలీసులు గుర్తించి గాంధీ ఆస్పత్రిలో చేర్చారు. సోమవారం చికిత్స పొందుతూ వ్యక్తి ఆస్పత్రిలో చనిపోయాడని గాంధీ వైద్యులు తెలిపారు.

## విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు

- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి):** సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి వైద్య సిబ్బందిని హెచ్చరించారు. డ్యూటీకి సమయానికి హాజరై రోగులకు మెరుగైన సేవలందించాలని ఆయన సూచించారు. సోమవారం బంజారాహిల్స్‌లోని విమలానగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగుల హాజరు పట్టికను పరిశీలించారు. పలువురు సిబ్బంది విధులకు ఆలస్యంగా రావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్పత్రికి వచ్చిన రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నందున సరిపడా మందులను అందుబాటులో ఉంచాలన్నారు. కాగా, విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన సూపర్‌వైజర్ విజయలక్ష్మి, ఏఎన్ఎంలు నాగలక్ష్మి, పార్వతికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని కలెక్టర్ ఆదేశించారు.



యూసుఫ్‌గూడ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో స్వచ్ఛ భారత్ ప్రతిజ్ఞ చేయిస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది

## ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛ భారత్

**యూసుఫ్‌గూడ, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి):** యూసుఫ్‌గూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీ క్యాడెట్స్ స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. జీహెచ్ఎంసీ సిబ్బంది ఆధ్వర్యంలో ఎన్‌సీసీ క్యాడెట్స్ పాఠశాల పరిసరాలను శుభ్రం చేశారు. మొక్కల మొదళ్ల వద్ద పాదులు చేసి, ఎరువు వేసి నీరు పోశారు. అనంతరం ఎన్‌సీసీ క్యాడెట్స్‌తో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతామని, చెత్తను కుండీలలోనే వేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పి.పరమేశ్వరమ్మ, ఎన్‌సీసీ అధికారి పి.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## మధురానగర్ కాలనీలో సమస్యలను పరిష్కరించాలి

**పంజాగుట్ట, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి):** వెంగళరావునగర్ డివిజన్ మధురానగర్ కాలనీలో సమస్యలను పరిష్కరించాలని సంక్షేమ సమితి ప్రతినిధులు కోరారు. సోమవారం యూసుఫ్‌గూడలోని జీహెచ్ఎంసీ సర్కిల్-19 కార్యాలయంలో డీఎంసీ జకీయా సుల్తానాను కలిసి సమితి ప్రతినిధులు వినతిపత్రం ఇచ్చారు. కాలనీలోని సమస్యలను ఆమె దృష్టికి తీసుకొచ్చారు. ఫుట్‌పాత్‌లను చిరు వ్యాపారులు ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్నారని, తరుచూ మ్యాన్ హోల్స్ పొంగి మురుగునీరు రహదారులపై ప్రవహిస్తోందని తదితర సమస్యలు ఉన్నాయని అన్నారు. త్వరలోనే కాలనీలో పర్యటిస్తానని ఆమె హామీ ఇచ్చారని వారు తెలిపారు.

## ఆకట్టుకుంటున్న హంస సిల్క్ ఎక్స్‌పో



ప్రదర్శనలో సందర్శకులు

**బంజారాహిల్స్, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి):** ఓ వైపు వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి... మరోవైపు పండుగల సీజన్... షాపింగ్ ప్రియులు తమకు కావాల్సిన వస్తువులను అన్ని చోట్ల తిరిగి కొనుగోలు చేయాలంటే ఇబ్బందికర పరిస్థితి. ఈ నేపథ్యంలో అన్ని రకాల ఉత్పత్తులను ఒకే గొడుగు కిందకు తీసుకువస్తు శ్రీనగర్‌కాలనీ సత్యసాయి నిగమాగమంలో ఏర్పాటు చేసిన హంస సిల్క్ ఎక్స్‌పో వస్త్ర ప్రదర్శన మహిళలను ఆకట్టుకుంటుంది. మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, కాంతావర్క్, హ్యాండ్ బ్లాక్, ప్రింటెడ్ శారీస్, లినెన్ శారీస్, కలంకారి, బెంగాల్ కాటన్, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ జాకెట్‌లు, లక్నోచికాన్, బనారస్ శారీస్, ఖాదీ మెటీరియల్, వన్‌గ్రామ్ గోల్డ్ జువెలరీ వంటివి మహిళలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. దేశ వ్యాప్తంగా 14 నగరాలకు చెందిన చేనేత కారులు తమ ఉత్పత్తులను 70కి పైగా స్టాల్స్‌లో పెట్టి వినియోగదారులకు అందుబాటులో ఉంచారు. ప్రవేశ ఉచితం అని, ప్రదర్శన ఈ నెల 26 వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.



ఎన్నికైన కమిటీ సభ్యులు

## టీఎన్‌పీఏ నూతన కమిటీ ఎన్నిక

**పంజాగుట్ట, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి):** తెలంగాణ న్యూస్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ (టీఎన్‌పీఏ) నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ప్యానెల్ ప్రొడ్యూసర్స్‌తో సమావేశం ఏర్పాటు చేశారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో కీలకంగా పనిచేసిన వ్యవస్థాపక అధ్యక్షుడు మనోహర్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా జోగిరెడ్డి, ఉపాధ్యక్షులుగా అంబటి రవి, సదానందు, కుమార్ ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా నాంపల్లి మురళీ, కార్యనిర్వాహణ కార్యదర్శిగా సింగం మదన్, ఉప కార్యనిర్వాహణ కార్యదర్శిగా సందీప్, కోశాధికారిగా మల్లికార్జున్, ఉప కోశాధికారిగా రాజ్ కుమార్, సంయుక్త కార్యదర్శులుగా తిరుపతి, రాజు, చుక్కల శ్రీను ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టుల హక్కులు, అక్రిడేషన్ తదితర సమస్యలపై ఎలా ముందుకు వెళ్లాలో త్వరలో కార్యాచరణను ప్రకటిస్తామని తెలిపారు.



ఖైరతాబాద్‌లో ఇంటింటి ఓటరు సర్వేను పరిశీలిస్తున్న ఎన్నికల కార్యాలయం పరిశీలకులు

## ఖైరతాబాద్‌లో ఇంటింటికి ఓటరు సర్వే

**ఖైరతాబాద్, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి):** ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఇంటింటి ఓటరు సర్వేను ప్రధాన ఎన్నికల కార్యాలయం నియమించిన పరిశీలకులు పర్యవేక్షించారు. ఆగస్టు 20వ తేదీ నుంచి ఇంటింటికి తిరుగుతూ ఓటరు సర్వే నిర్వహిస్తున్నారు. ఇందులో ఇప్పటివరకు 800 మంది ఓటర్లు చనిపోయినట్టు, దాదాపు 17 వేల మంది చిరునామా మారారని గుర్తించారు. ఇప్పటి వరకు ఖైరతాబాద్‌లో 93 శాతం సర్వే పూర్తయిందని, సర్వే అనంతరం చనిపోయినవారి పేర్లు, చిరునామా మారిన వారి పేర్లు తొలగించేందుకు నోటీసులు అందజేస్తామని పరిశీలకులకు ఈఆర్‌ఓ, సర్కిల్ 18 ఉప కమిషనర్ ప్రశాంతి వివరించారు. 93 శాతం సర్వే పూర్తవడంతో అభినందదించడంతో పాటు మిగతా సర్వే మరో 2 రోజుల్లో పూర్తి చేయాలని సూచించారు. బీఎల్‌ఓలు ఇంటింటికి వెళ్లినప్పుడు కొత్త ఓటర్లుగా నమోదు అయ్యే విషయమై అవగాహన కల్పించాలని కోరారు. ఖైరతాబాద్‌లో 3,00,606 మంది ఓటర్లు ఉన్నారని జనవరి 1న డ్రాఫ్ట్ పబ్లికేషన్ ప్రచురించి అభ్యంతరాలను స్వీకరిస్తామని ప్రశాంతి తెలిపారు.

## పంజాబ్ నుంచి నగరానికి గంజాయి చాక్లెట్లు

- విక్రయిస్తున్న పాత నేరస్థుడి అరెస్ట్
- రూ. 1.02 లక్షల విలువైన చాక్లెట్లు స్వాధీనం

**హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి):** అధిక సంపాదన కోసం పంజాబ్ నుంచి గంజాయి చాక్లెట్లు కొనుగోలు చేసి నగరంలో విక్రయిస్తున్న పాత నేరస్థుడిని మాదాపూర్ ఎస్ఓటీ, పేట్‌బషీరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి వద్ద నుంచి రూ.1.02 లక్షల విలువైన గంజాయి చాక్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. మేడ్చల్ జోన్ డీసీపీ కోటిరెడ్డి తెలిపిన వివరాలు ప్రకారం... పంజాబ్‌కు చెందిన తమ్కిస్సార్ సింగ్ (55) కుటుంబం కొంతకాలం క్రితం వలస వచ్చి సూర్యాపేటలో స్థిరపడ్డారు. తమ్కిస్కార్ సింగ్ 10ఏళ్ల కిత్రం గాజులరామారం ప్రాంతానికి వచ్చాడు. గృహోపకరణాలు తయారు చేస్తూ విక్రయించేవాడు. చెడు వ్యసనాలకు బానిసైన తమ్కిస్కార్ సింగ్ వచ్చే ఆదాయం సరిపోకపోవడంతో గంజాయి విక్రయాలు ప్రారంభించాడు. రెండు సార్లు అరెస్టయి జైలుకు కూడా వెళ్లి వచ్చాడు. అయినా తీరుమార్చుకోకుండా గంజాయి చాక్లెట్ల విక్రయం ప్రారంభించాడు. పంజాబ్ రాణీపూర్ జిల్లా ఆనంద్‌పూర్ సాహిబ్‌లో గుర్తుతెలియని వ్యక్తి నుంచి గంజాయి చాక్లెట్లు కొనుగోలు చేస్తున్నాడు. ఒక్కో గంజాయి చాక్లెట్ రూ.40 చొప్పున విక్రయిస్తున్నాడు. ఇతడి దందాపై పక్కా సమాచారమందుకున్న మాదాపూర్ ఎస్ఓటీ, పేట్‌బషీరాబాద్ పోలీసులు వలపన్ని అరెస్ట్ చేశారు. అతడి వద్ద నుంచి 12.7 కేజీల గంజాయి చాక్లెట్స్, 680 గ్రాముల ఎండు గంజాయి స్వాధీనం చేసుకొని, రిమాండ్‌కు తరలించారు.

## 'ఇమేజ్ ప్రాసెసింగ్ అండ్ మెషీన్ లెర్నింగ్' అంశంపై 27, 28 తేదీల్లో జేఎన్‌టీయూలో జాతీయ సదస్సు

**హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి):** 'ఇమేజ్ ప్రాసెసింగ్ అండ్ మెషీన్ లెర్నింగ్' అంశంపై ఈ నెల 27, 28 తేదీల్లో జేఎన్‌టీయూలో జాతీయ సదస్సు నిర్వహిస్తున్నారు. వర్సిటీలోని ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగం, బెంగళూరుకు చెందిన కోరెల్ సంస్థ సంయుక్తంగా ఈ సదస్సును నిర్వహిస్తున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో పనిచేస్తున్న ఈసీఈ, సీఎస్ఈ ఆచార్యులు తమ నైపుణ్యాలను అభివృద్ధి పరచుకునేందుకు ఈ సదస్సు ఎంతగానో దోహదపడుతుందని నిర్వాహకులు తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 25 లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, మరిన్ని వివరాలకు జేఎన్‌టీయూ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

## మెట్టుగూడ కార్పొరేటర్ అరెస్ట్


కార్పొరేటర్‌ను అరెస్ట్ చేసి తీసుకెళ్తున్న పోలీసులు

చిలకలగూడ, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీతను సోమవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గాంధీ ఆస్పత్రిలో మరణాలకు సంబంధించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచనల మేరకు ఆమె ఆస్పత్రికి వెళ్లే ప్రయత్నం చేయగా అరెస్ట్ చేసి చిలకలగూడ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా పోలీసులు అరెస్ట్ చేయడం అన్యాయమని, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడతానని ఆమె పేర్కొన్నారు.

## వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉన్నాం

- ఎమ్మార్వో అశోక్‌కుమార్



తిరుమలగిరి సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించడంతో తిరుమలగిరి మండల కార్యాలయం సిబ్బందిని అలెర్ట్ చేశామని ఎమ్మార్వో అశోక్‌కుమార్ సోమవారం ఆంధ్రజ్యోతికి తెలిపారు. మండల పరిధిలో లోతట్టు ప్రాంతాలను గుర్తించినట్లు ఆయన వెల్లడించారు. ఇళ్లలోకి నీరు వచ్చినా, పాత భవనాలు, చెట్లు కూలినా ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా సిబ్బంది ఎప్పటికప్పుడు తీసుకుంటారని.. 24 గంటల పాటు ప్రజలకు అందుబాటులో ఉంటారన్నారు. సమాచారం కోసం తన నంబర్ 9063425682కి కాల్ చేయాలని సూచించారు.


శేఖర్‌ముదిరాజ్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే తలసాని

## బస్తీల అభివృద్ధికి సహకారం అందిస్తా

మారేడుపల్లి, సెప్టెంబర్23 (ఆంధ్రజ్యోతి): బస్తీల అభివృద్ధికి అన్ని విధాలుగా సహకారం అందిస్తానని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ హామీ ఇచ్చారు. బేగంపేట డివిజన్ ఎన్‌బీటీనగర్ పాటిగడ్డ బస్తీకి నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన శేఖర్‌ముదిరాజ్ సోమవారం ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా ఆయన శేఖర్‌ముదిరాజ్‌ను శాలువాతో సత్కారించారు.


విద్యార్థినికి బ్యాడ్జి అందజేస్తున్న బ్రిగేడియర్

## కేవీ పికెట్ హౌస్ కెప్టెన్ల ప్రమాణస్వీకారం

సికింద్రాబాద్, సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): కేంద్రీయ విద్యాలయ పికెట్‌లో హౌస్ కెప్టెన్ల ప్రమాణస్వీకారోత్సవం ఘనంగా జరిగింది. నూతనంగా ఎన్నికైన కెప్టెన్లు, సభ్యులతో ముఖ్య అతిథి వీఎంఎసీ చైర్మన్ బ్రిగేడియర్ శైలేంద్రసింగ్ ప్రమాణం చేయించారు. వారికి బ్యాడ్జీలు అందజేశారు. ప్రిన్సిపాల్ రూపీందర్‌సింగ్ వారికి స్వాగతం పలికారు.

## బహిరంగ ప్రదేశంలో మూత్ర విసర్జన చేసినవారిపై కేసు నమోదు

అల్వాల్, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో కాలనీలోని ఇళ్ల మధ్య మూత్ర విసర్జన చేసిన ఘటనలో కాలనీవాసులకు, మూత్ర విసర్జన చేసిన వ్యక్తుల మధ్య జరిగిన ఘర్షణలో ముగ్గురు వ్యక్తులపై హత్యాయత్నం కింద కేసు నమోదు చేసిన సంఘటన సోమవారం అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. అల్వాల్ స్టేషన్ హౌజ్ ఆఫీసర్ రాహుల్‌దేవ్ తెలిపిన వివరాల ప్రకారం.. అల్వాల్ ప్రాంతానికి చెందిన శ్రీకాంత్‌యాదవ్(33), నరేష్‌యాదవ్(30), మహేశ్‌తో కలిసి మద్యం సేవించారు. అనంతరం ఆదివారం రాత్రి అల్వాల్ డివిజన్‌లోని నాగిరెడ్డి కాలనీకి వెళ్లారు. అక్కడ బహిరంగా ప్రదేశంలో ఇళ్ల మధ్యలో మూత్ర విసర్జన చేశారు. ఈ విషయంలో కాలనీవాసులు మోహన్‌రెడ్డి, అజయ్ ఇళ్ల మధ్య మూత్రం ఎందుకు పోస్తున్నారని ప్రశ్నించడంతో, మద్యం మత్తులో ఉన్న శ్రీకాంత్‌యాదవ్, నరేష్‌యాదవ్, మహేశ్‌లు కర్రలతో మోహన్‌రెడ్డి, అజయ్‌లపై తిరగబడ్డారు. దీంతో వారి తలలకు తీవ్రరక్తగాయాలు కావడంతో పాటు చెయ్యి విరిగింది. కాగా, బాధితులు, కాలనీ వాసులు కలిసి సోమవారం అల్వాల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మోహన్‌రెడ్డి, అజయ్‌లపై దాడి చేసిన శ్రీకాంత్‌యాదవ్, నరేష్‌యాదవ్, మహేశ్‌లపై హత్యాయత్నం కింద కేసు నమోదు చేశారు. శ్రీకాంత్‌యాదవ్, నరేష్‌యాదవ్‌లను పోలీసులు సోమవారం రిమాండ్‌కు తరలించారు. మహేశ్ పరారీలో ఉన్నట్లు ఎస్‌హెచ్‌వో రాహుల్‌దేవ్ పేర్కొన్నారు.

## మహిళ ఆత్మహత్య

అల్వాల్, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదస్థితిలో ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సిద్దిపేట జిల్లా కొమురవెల్లి గ్రామానికి చెందిన పరుశురాం కుటుంబం 10 సంవత్సరాల క్రితం నగరానికి వలస వచ్చి అల్వాల్ కానాజిగూడశివానగర్‌లో భార్య భాగ్యలక్ష్మీతో నివసిస్తున్నారు. ఈ దంపతులకు ఆరేళ్లలోపు ఇద్దరు చిన్నారులు ఉన్నారు. భర్త పరుశురాం బోయిన్‌పల్లి మార్కెట్‌లో వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఈక్రమంలో సోమవారం సాయంత్రం భాగ్యలక్ష్మీ ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె మృతికి గల కారణాలు వెల్లడి కాలేదు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# వీధులను ముంచెత్తి.. ఇళ్లలోకి చేరి

- మహాత్మానగర్‌బస్తీలో తీవ్రంగా మురుగు సమస్య
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు


సమస్య పరిష్కారానికి ప్రయత్నిస్తున్న కంటోన్మెంట్ బోర్డు సిబ్బంది


బస్తీలోని ఓ ఇంటిలో చేరిన మురుగు

బోయినపల్లి, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ నియోజకవర్గం పరిధిలోని 6వ వార్డు మహాత్మానగర్‌బస్తీలో పారిశుధ్య సమస్య తీవ్రంగా ఉంది. ఇళ్ల చుట్టూ మురుగు నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమీపంలోని కాలనీల్లో సైతం ఇలాంటి పరిస్థితే నెలకొంది. మురుగు సమస్యను అధికారులకు, స్థానిక ప్రజాప్రతినిధులతో పాటు ఎమ్మెల్యేకు విన్నవించినా ఎలాంటి స్పందన లేదని స్థానికులు వాపోతున్నారు. తమ ఇళ్లను మురుగు చుట్టేయడంతో దోమలు, ఈగల బెడద తీవ్రంగా ఉందని.. దీంతో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని చెబుతున్నారు. మురుగు నీరు ఇళ్లలోకి వచ్చి చేరడంతో ఇక్కడ ఉండలేకపోతున్నామని, ఆరు రోజులుగా ఇదే పరిస్థితి ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరు సంవత్సరాలుగా కంటోన్మెంట్ బోర్డు ఎన్నికలు నిర్వహించకపోవటంతో తమ సమస్యలను ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని, ఎన్నికల తర్వాత స్థానిక ఎమ్మెల్యే తమ ప్రాంతం వైపు కన్నెత్తి చూడట్లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మహాత్మానగర్‌లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో వీధుల మధ్యలో మురుగునీరు ప్రవహిస్తుందని చెబుతున్నారు. చెత్తాచెదారం పేరుకుపోయి భరించలేని దుర్వాసన వస్తోందంటున్నారు. ఓపెన్ నాలాలు ప్రమాదకరంగా మారాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే కాలువల నిర్మాణానికి నిధులు కేటాయించినా పనులు ముందుకు సాగకపోవడంతో ప్రజలకు మురుగు కష్టాలు తప్పడం లేదు. ఈ ప్రాంతంలో పలు కాలనీల్లో మురుగు కాలువల పరిస్థితి అధ్వానంగా తయారైంది. మురుగు నీటి సమస్య పరిష్కారానికి కోట్ల రూపాయలు కేటాయిస్తున్నామని ఎన్నికల సమయంలో పాలకులు చెబుతున్నా.. ప్రజలకు మౌలిక సౌకర్యాలు కల్పించడంలో మాత్రం విఫలమవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.


మహాత్మానగర్ బస్తీలోని ఓ వీధిలో మురుగు నీరు


పొంగిన డ్రైనేజీ మ్యాన్‌హోల్

## సికింద్రాబాద్ అభివృద్ధికి రూ.3500 కోట్లు కేటాయించండి

- సీఎంకు లష్కర్ జిల్లా సాధన సమితి విజ్ఞప్తి


సీఎంకు రాసిన లేఖతో లష్కర్ జిల్లా సాధన సమితి సభ్యులు

బౌద్ధనగర్, సెప్టెంబర్23 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి రూ.3500 కోట్లు కేటాయించాలని లష్కర్ జిల్లా సాధన సమితి సభ్యులు కోరారు. ఈ మేరకు సోమవారం సీతాఫల్‌మండి కార్యాలయంలో సమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి సాదం బాలరాజ్ సభ్యులు మిట్టపల్లి బాబురావు, శైలేందర్, రవీందర్‌సాగర్, అజీజ్‌తో కలిసి సీఎంకు లేఖ రాశారు. ఈ సందర్భంగా పవన్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. గ్రేటర్ హైదరాబాద్ అభివృద్ధికి బడ్జెట్‌లో రూ.10 వేల కోట్లు కేటాయించటం హర్షనీయమన్నారు. అయితే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, గచ్చిబౌలి, మాదాపూర్, కొండాపూర్, మణికొండ తదితర ప్రాంతాల అభివృద్ధిపై దృష్టి సారిస్తున్నారు తప్ప రెండు వందల సంవత్సరాల చరిత్ర గలిగిన సికింద్రాబాద్‌కు ఎలాంటి ప్రతిపాదనలు లేకపోవటం బాధాకరమన్నారు. లష్కర్ ప్రాంతంపై రేవంత్‌రెడ్డి అభివృద్ధి ముద్ర ఉండాలన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతం ఎలా వివక్షకు గురైందో ప్రస్తుతం సికింద్రాబాద్ పరిస్థితి సైతం అలానే ఉందన్నారు. సికింద్రాబాద్ ప్రాంతంలో రోడ్ల విస్తరణకు ఎన్నో ప్రతిపాదనలు జీహెచ్‌ఎంసీ పరిధిలో ఉన్నప్పటికీ నిధులు కేటాయించకపోవడం దురదృష్టకరమన్నారు. లష్కర్ జిల్లా ఏర్పాటు చేయాలని మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్యే దానం నాగేందర్, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌కు వినతిపత్రాలు అందజేసినట్లు వారు తెలిపారు.


సనత్‌నగర్ డివిజన్‌లో సోమవారం నిర్వహించిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పార్టీ నాయకులు లింగంపల్లి నర్సింగ్‌రావు, బాలనరసింహ, ఆకుల మహేష్, రమేష్‌గౌడ్, నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- సనత్‌నగర్, (ఆంధ్రజ్యోతి)

## 27న దళిత జర్నలిస్ట్ చైతన్య సదస్సు


కరపత్రాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే తలసాని

మారేడుపల్లి, సెప్టెంబర్ 23(ఆంధ్రజ్యోతి): దళిత జర్నలిస్ట్ ఫోరం అధ్వర్యంలో జరిగే దళిత జర్నలిస్ట్ చైతన్య సదస్సు కరపత్రాలను సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆవిష్కరించారు. ఈ నెల 27న రవీంద్ర భారతిలో నిర్వహించే సభకు హాజరుకావాలని కోరుతూ వెస్ట్ మారేడుపల్లిలోని తన కార్యాలయంలో దళిత జర్నలిస్ట్ ఫోరం ప్రతినిధులు కలిసి ఆహ్వానపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫోరం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు డి.శివకుమార్, ప్రధాన కార్యదర్శి ఎం.మల్లేష్, గౌరవ అధ్యక్షులు బాబురావు, కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.రాజు తదితరులు పాల్గొన్నారు.



క్లాక్‌టవర్ వద్ద నిరుద్యోగ కళాకారుల సంఘం నాయకులు

## వరద బాధితుల కోసం విరాళాల సేకరణ

రెజిమెంటల్‌బజార్, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమ నిరుద్యోగ కళాకారుల సంఘం హైదారాబాద్ జిల్లా ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా వరద బాధితుల కోసం విరాళాలు సేకరించారు. సోమవారం సికింద్రాబాద్ క్లాక్‌టవర్ అమరవీరుల స్థూపం నుంచి బయలుదేరి మోండా మార్కెట్, బాటా, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ప్యాట్నీ సెంటర్ పరిధిలోని ప్రాంతాలలో విరాళాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు అక్షయ్, బుగ్గన్న, యాకన్న, రమేష్, రాణి, మహేష్, రాజశ్రీ, విష్ణు, రాజు, రవి, సయ్యద్, సంపత్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

# మరుగుదొడ్ల మాటున అక్రమార్జన

- సహకరించిన వారిపై చర్యలకు డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న శామ్యూల్ కార్తీక్, సాయి గణేష్, అనిల్

పంజాగుట్ట, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): మరుగుదొడ్ల మాటున అక్రమార్జనకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని, గత ప్రభుత్వ హయాంలో చేసిన లూ కేఫే ఒప్పందాన్ని రద్దు చేయాలని పలువురు లూ కేఫే నిర్వాహకులు డిమాండ్ చేశారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో శేరిలింగంపల్లికి చెందిన శామ్యూల్ కార్తీక్, సాయి గణేష్, లూ కేఫే నిర్వాహకులు అనిల్, భరత్‌లు వివరాలు వెల్లడించారు. జీహెచ్ఎంసీ పరిధిలో ప్రధాన రహదారులలో ప్రజా మరుగుదొడ్లను అందుబాటులోకి తీసుకురావాలని టెండర్లు పిలవగా బీహార్‌కు చెందిన ఎక్సోరా కార్పొరేట్ సర్వీసెస్ ప్రైవేటు లిమిటెడ్ అధినేత అభిషేక్ నాథ్ అప్పటి ప్రభుత్వ పెద్దలు, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్, సీఎస్ సోమేశ్ కుమార్, మున్సిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్‌ల సహకారంతో కాంట్రాక్టు దక్కించుకున్నాడని అన్నారు. శేరిలింగంపల్లి, ఖైరతాబాద్ జోన్ల పరిధిలో డివిజన్‌కు 13 చొప్పున సుమారు వందకు పైగా లూ కేఫేలను జీహెచ్ఎంసీ ఏర్పాటు చేసిందని, వాటిని నిర్వహణ చూస్తామని చెప్పి ఒక్కో లూ కేఫేను ఇరవై వేల రూపాయలు నుంచి లక్ష రూపాయల వరకు అడ్వాన్స్‌లు తీసుకుని నెలకు ఎనిమిది నుంచి పది వేలకు పైగా చెల్లించే విధంగా వేరే వారికి కట్టబెట్టారని అన్నారు. ఒక్కో కేఫేకు జీహెచ్ఎంసీకి సంవత్సరానికి కేవలం రూ.1385 రూపాయలు మాత్రమే కడుతూ తమ వద్ద నుంచి నెలకు వేల రూపాయలు వసూలు చేస్తున్నాడని, ఈ విధంగా అతను నెలకు కోటి రూపాయల వరకు సంపాదిస్తున్నాడని అన్నారు. ప్రభుత్వం స్పందించి అతని సంస్థతో చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేసి తమకే వాటి నిర్వహణ అప్పగించాలని అన్నారు. లూ కేఫేల చుట్టూ యాడ్స్ ప్రదర్శిస్తూ వేల రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారని అన్నారు. ఒక్కో కేఫేకు సుమారు 3.40 లక్షల రూపాయలను జీహెచ్ఎంసీ వెచ్చించిందని అన్నారు. లూ కేఫేల నిర్వహణ, తదితర వాటిపై విచారణ జరిపించాలని, గత ప్రభుత్వ హయాంలో చక్రం తిప్పిన అప్పటి సీఎస్, మున్సిపల్ పరిపాలన శాఖ ఉన్నతాధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆర్టీఐ ద్వారా పూర్తి సమాచారాన్ని సేకరించామని, తమ వద్ద ఆధారాలు ఉన్నాయని అన్నారు. సమావేశంలో పలువురు నిర్వాహకులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ యాచకుడి మృతి

సనత్‌నగర్, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): భరత్‌నగర్ బ్రిడ్జిపై అనారోగ్యంతో ఉన్న ఓ యాచకుడిని పోలీసులు గాంధీ ఆస్పత్రిలో చేర్పించారు. అయితే అతడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి 50 ఏళ్ల వయసు ఉంటుందని.. అతడి గురించి వివరాలు తెలిసిన వారు సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు సూచించారు.

## ఐస్‌క్రీమ్ పార్లర్‌లో చోరీ

తిరుమలగిరి సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): ఐస్‌క్రీం పార్లర్‌లో దొంగతనం జరిగిన ఘటన బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. రక్షణ శాఖ పరిధిలో ఉన్న ఆర్ఎస్ఐ క్లబ్ వద్ద మిల్క్, ఐస్ క్రీం పార్లర్‌ను ఆర్మీ సిబ్బంది నడుపుతున్నారు. అయితే ఆదివారం రాత్రి తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లిన గుర్తుతెలియని వ్యక్తులు క్యాష్ కౌంటర్‌లోని నగదు, సీసీ కెమెరాలు, నెట్‌వర్క్ సెటప్, టీవీని తీసుకెళ్లారు. ఆర్మీ సిబ్బంది ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

# సోషల్ మీడియాపై అవగాహన సదస్సు


సదస్సులో పాల్గొన్న పోలీస్ అధికారులు, స్కూల్ నిర్వాహకులు, విద్యార్థులు

ఎర్రగడ్డ, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాను ఎక్కువగా వాడటంతో ఒత్తిడి, అశాంతి, ఒంటరితనం, డిప్రెషన్ వంటి అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని దిల్‌సే వలంటీర్ అసోసియేట్ డైరెక్టర్ కట్ట దుర్గ అన్నారు. సోమవారం సంస్కార దిలైఫ్ స్కూల్లో సైబర్ క్రైమ్ అవేర్నెస్, సోషల్ మీడియా ద్వారా ఎదురయ్యే అనర్థాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తగ్గిన ఇంటర్నెట్ చార్జీల పుణ్యమా అని ప్రతి ఒక్కరూ సోషల్ మీడియా ను ఎక్కువ వాడేస్తున్నారని, దీనివల్ల తక్కువ లాభాలు, ఎక్కువ నష్టాలు ఉన్నాయని అన్నారు. దిల్‌సే వలంటీర్ సీనియర్ ప్రొడక్ట్ మేనేజర్ రూప శంముగం మాట్లాడుతూ సోషల్ మీడియా అనేది ఉపయోగించుకునే దాన్నిబట్టి ఉంటుందని దాంట్లోని మంచిని ఉపయోగించుకుని అభివృద్ధి చెందాలని చెడును వదిలేయాలని సూచించారు. సోషల్ మీడియాను అధికంగా వాడితే అనర్థాలు తప్పవని, దీన్ని అధికంగా వాడడం వల్ల అబ్బాయిల కన్నా అమ్మాయిలపైనే ఎక్కువ చెడు ప్రభావం ఉంటుందన్నారు. సనత్‌నగర్ పీఎస్ ఎస్ఐ హరీష్ మాట్లాడుతూ సైబర్ క్రైమ్ అనేది కంప్యూటర్ ఉపయోగించి చేసే ఒక నేరపూరిత చర్య అన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత సమాచారాన్ని ఇవ్వడం, ఓటీపీలు షేర్ చేయడం లాంటివి చేయకుండా సైబర్ క్రైమ్‌పై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈరోజుల్లో సైబర్ నేరగాళ్లు తెలివిగా ఫోన్ చేసి ఏదో విషయంలో బెదిరింపులకు పాల్పడి డబ్బులను డిమాండ్ చేస్తున్నారన్నారు. అలాంటి వాటికి భయపడకుండా వెంటనే పోలీసులను ఆశ్రయించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో స్కూల్ ఫౌండర్ సీఈవో మోహన వంశీ, డైరెక్టర్ మధుమతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

రాంగోపాల్‌పేట్, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందిన ఘటన మహంకాళి పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జీడిమెట్ల డిపోకు చెందిన బస్సు సికింద్రాబాద్ నుంచి గండిమైసమ్మ వెళ్తుండగా సర్దార్ పటేల్ రోడ్డులోని కోరమండల్ బిల్డింగ్ సమీపానికి రాగానే ఫుట్‌పాత్‌పై కూర్చున్న 35-40 ఏళ్ల వ్యక్తి ఒక్కసారిగా వెనుక చక్రాల కింద దూకే ప్రయత్నం చేశాడు. దీంతో ఫుట్‌బోర్డు తలకు బలంగా తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. బస్ కండక్టర్ ముడావత్ శంకర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేపట్టారు. మృతిచెందిన వ్యక్తి మానసిక స్థితి సరిగా లేదని అతడిని చూసిన వారు చెబుతున్నారు. మృతుడి కుడి చేతిపై మామ్ కుట్టీ అని ఇంగ్లిష్‌లో పచ్చబొట్టు ఉందని, నలుపు రంగు ట్రాక్ ప్యాంట్, యాష్ కలర్ టీ షర్ట్, దానిపై గ్రీన్ కలర్ జాకెట్ ఉంది. అతడి గురించి ఎవరికైనా వివరాలు తెలిస్తే మహంకాళి పోలీసులను సంప్రదించాలని, లేదా 040278535711, 8712661253 నంబర్లకు కాల్ చేయాలని పోలీసులు కోరారు.